ప్రజాశక్తి
గురువారం 23 ఫిబ్రవరి 2023 5
శ్రీకాకుళం



ఫేస్ అటెండెన్స్ బాధ్యత డిడిఒలదే

శ్రీకాకుళం: ప్రభుత్వ ఉద్యోగుల ఎఫ్ఆర్ఎస్ (ముఖ గుర్తింపు వ్యవస్థ) ఆధారిత హాజరు బాధ్యత డిడిఒలదేనని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పష్టం చేశారు. ఎఫ్ఆర్ఎస్ అమలు తీరుపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సాధారణ పరిపాలన అధికారి ముత్యాలరాజు, సిఎఫ్ఎంఎస్ అధికారి సునీల్ రెడ్డి కలెక్టర్‌తో వర్చువల్ విధానంలో బుధవారం సమావేశమయ్యారు. ప్రతి ఉద్యోగి ఎపిఎఫ్ఆర్ఎస్‌లో రిజిస్ట్రేషన్ అయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులంతా తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్‌లోనే హాజరు వేసేలా డిడిఒలు బాధ్యత వహించాలన్నారు. జిపిఎస్ ఆధారంగా ఉద్యోగుల ఎఫ్ఆర్ఎస్ నమోదు ఉంటుందన్నారు. విధుల్లో ఉండే ఉద్యోగులు ఒడి కింద హాజరు వేస్తే జిపిఎస్ ఆధారంగా సంబంధిత ఉద్యోగి హాజరును డిడిఒలు ధ్రువీకరించాల్సి ఉందన్నారు. ఎఫ్ఆర్ఎస్‌లో లొకేషన్ చూపడం లేదని, ఎదురవుతున్న పలు సాంకేతిక సమస్యలను వివరించారు. అనంతరం పలు శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సమీక్షించారు. సమావేశంలో డిఆర్ఒ రాజేశ్వరీ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పునరావాసం ఎప్పుడో..?



గోపివల్లభపురం ఆర్ అండ్ ఆర్ కాలనీలో పరిస్థితి



చీపురుపల్లి నిర్వాసితుల కాలనీలో రోడ్డు దుస్థితి

- ఆఫ్‌షోర్ కాలనీల్లో అరకొరగా సౌకర్యాలు
- 39 రకాల పనులకు 13 మాత్రమే పూర్తి
- మౌలిక వసతులకు నిధుల విడుదలలో ఉదాసీనం
- రూ.21.42 కోట్లకు రూ.3.30 కోట్లే ఇచ్చిన ప్రభుత్వం

ప్రాజెక్టు పనులపై దృష్టిసారిస్తున్న ప్రభుత్వాలు నిర్వాసితుల సమస్యలను విస్మరిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రిజర్వాయరు నిర్మాణం కోసం భూములు ఇచ్చి, తమ ఆస్తులను వదులుకున్న నిర్వాసితులకు కన్నీళ్లనే మిగిలుస్తున్నాయి. గ్రామాలను ఖాళీ చేసి వచ్చినా, కాలనీల్లో సౌకర్యాలు లేకపోవడంతో మళ్లీ తమ సొంత ఊళ్లలోనే తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. తమ కాలనీల్లో మంచినీరు, రోడ్లు నిర్మించాలని నిర్వాసితులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మరోవైపు కాలనీలో కనీస సౌకర్యాల కల్పనకు నిధులు విడుదల చేయడంలోనూ ప్రభుత్వం తీవ్ర ఉదాసీనత కనబరుస్తోంది. దీంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి, మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో 2008లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించారు. పలాస మండలంలోని రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణ పనులతో పలాస మండలం రేగులపాడు, నందిగాం మండలం శారదాపురం, చిన్నగురువూరు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా గుర్తించింది. వీరికి పునరావాసం కల్పించేందుకు పలాస మండలం రామకృష్ణాపురం, చీపురుపల్లి, గోపివల్లభపురం ప్రాంతాల్లో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. రామకృష్ణాపురంలో పలు ప్రభుత్వ శాఖల కింద 16 రకాల పనులు చేపట్టగా, ఇప్పటివరకు ఏడు పనులు మాత్రమే పూర్తయ్యాయి. చీపురుపల్లిలో తాగునీటి పథకాలు, అంగన్వాడీ, సామాజిక భవనాలు తదితర 13 పనులు మంజూరు కాగా నాలుగు పనులు మాత్రమే పూర్తయ్యాయి. తొమ్మిది రకాల పనులు కొనసాగుతున్నాయి. గోపివల్లభపురంలో పది రకాల పనులు చేపట్టగా, రెండు పనులు మాత్రమే పూర్తయ్యాయి. మరో మూడు పనులు ప్రగతిలో ఉన్నాయి. గ్రామీణ నీటి సరఫరా ద్వారా చేపట్టాల్సిన మరో పనికి టెండరు ఖరారు కాలేదు. కార్యాలయ భవనం పనులను ప్రారంభించి అర్ధాంతరంగా నిలుపుదల చేశారు.

రూ.21.42 కోట్లకు రూ.3.30 కోట్లే విడుదల

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు కేటాయించిన పునరావాస కాలనీల్లో మౌలిక వసతులకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. రామకృష్ణాపురం, చీపురుపల్లి, గోపివల్లభపురం ప్రాంతాల్లో నిర్మిస్తున్న కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, అంగన్వాడీ, సామాజిక భవనాలు తదితర పనులు పూర్తి కావాలంటే రూ.21.42 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం ఇప్పటివరకు రూ.3.30 కోట్లే విడుదల చేసింది. చీపురుపల్లి కాలనీలో చేపడుతున్న పనులకు రూ.10.03 కోట్లు అవసరం కాగా రూ.1.80 కోట్లు మాత్రమే విడుదల చేసింది. మరో రూ.8.23 కోట్లను ఇవ్వాల్సి ఉంది. చీపురుపల్లి నిర్వాసిత కాలనీలో సౌకర్యాల కోసం రూ.4.45 కోట్లు కావాల్సి ఉండగా రూ.75.10 లక్షలను మంజూరు చేసింది. కాలనీలో పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనకు రూ.3.70 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. గోపివల్లభపురం కాలనీకి రూ.6.94 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం రూ.74.57 లక్షలను మాత్రమే కేటాయించింది. కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాల కోసం రూ.6.19 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

ప్రాజెక్టు నిర్మాణంపైనే పాలకుల శ్రద్ధ

ఆఫ్‌షోర్ నిర్మాణం, ఆ కాంట్రాక్టును ఎవరికి కట్టబెట్టాలన్న అంశంపైనే గత టిడిపి ప్రభుత్వం శ్రద్ధ చూపిందే తప్ప నిర్వాసితుల జోలికి పోలేదు. పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆఫ్‌షోర్ పూర్తి చేస్తామని మాట చెప్పారే గానీ నిర్వాసితుల పునరావాసంపై కనీసం మాట్లాడడం లేదు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఇందుకోసం నిర్వాసితులను బలవంతంగానైనా తరలించాలని అధికారుల చర్చల్లో వినిపిస్తోంది. భూసేకరణ చట్టం-2013 ప్రకారం నిర్వాసితులకు పునరావాసం కల్పించిన తర్వాతే వారిని గ్రామాల నుంచి పంపాల్సి ఉంటుంది. రిజర్వాయర్‌ను పూర్తి చేసి ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని చూస్తున్న ప్రభుత్వానికి బలవంతంగా నిర్వాసితుల తరలింపు ఏరకంగా చూసుకున్నా నష్టదాయకమే. ప్రభుత్వం ఇప్పటికైనా పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

తాగడానికి నీళ్లు లేవు



నిర్వాసితుల కాలనీలో సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తాగడానికి నీళ్లు లేవు. విద్యుద్దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రివేళల్లో విష సర్పాలు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి.

- ఎన్.గణపతి, చీపురుపల్లి, మెళియాపుట్టి మండలం

శ్మశాన స్థలం లేదు



కాలనీలో కనీసం శ్మశాన స్థలం లేదు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు లేవు. రేషన్ సరుకుల కోసం సుమారు 20 కిలోమీటర్లు నడిచి వెళ్తున్నాం.

-ఆర్.చంద్రశేఖర్, శారదాపురం (నందిగాం మండలం)



శ్రీకాకుళం : నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

లక్ష్యాల పేరిట వేధింపులు

పోస్టల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పొందూరు

లక్ష్యాల పేరిట అధికారులు ఉద్యోగులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఎన్ఎఫ్‌పిఇ, ఎఫ్ఎన్‌పిఒ నాయకులు విమర్శించారు. వేధింపులను నిరసిస్తూ నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద, పొందూరులో పోస్టాఫీసు వద్ద పోస్టల్ ఉద్యోగులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు గణపతి, జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ గత నెల 28న దేశవ్యాప్తంగా ఒకే రోజు కోటి కొత్త ఖాతాలు తెరవాలని, ఈనెల 9, 10 తేదీల్లో 7.5 లక్షల సుకన్య సమృద్ధి ఖాతాలు తెరవాలని లక్ష్యాలు విధించారని తెలిపారు. ఈనెల 20 నుంచి 24 వరకు ప్రతి పోస్టాఫీసు పరిధిలో 50 ఖాతాలు తెరవాలని లక్ష్యాలు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలోని పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు అత్యుత్సాహంతో లక్ష్యాలు ఇచ్చి కిందిస్థాయి ఉద్యోగులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మానసిక ఒత్తిడి కారణంగా ఇటీవల మచిలీపట్నంలోని పామర్రు బజారు సబ్ పోస్టుమాస్టర్ అధికారుల వేధింపుల వల్ల గుండెపోటుతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులకు నిరసనగా ఈనెల 23వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పోస్టల్ డివిజన్‌లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు నిరంకుశం వైఖరిలో మార్పు రాకపోతే వచ్చే నెల 9న విజయవాడలోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాబూరావు, వేణుగోపాలరావు, రాంబాబు, రమేష్, ఢిల్లేశ్వరరావు, బి.సురేష్, ఎం.శ్రీనివాసరావు, దేవిక, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పొందూరులో నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

చీకట్లో జీవిస్తున్నాం

- గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి
- సబ్ కలెక్టర్‌ను కోరిన ఆఫ్‌షోర్ నిర్వాసితులు

ప్రజాశక్తి - పలాస, మెళియాపుట్టి

భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు, యూత్ ప్యాకేజీలు ఇప్పటివరకు అమలు చేయలేదని, నిర్వాసితుల కాలనీలో నిర్మించుకున్న ఇళ్లకు రహదారులు, కాలువలు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆఫ్‌షోర్ నిర్వాసితులు వాపోయారు. విద్యుత్ స్తంభాలు వేసినా వాటికి బల్బులు అమర్చలేదని, చీకటిలోనే జీవిస్తున్నామని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి దృష్టికి తెచ్చారు. బుధవారం పలాస మండలం రేగులపాడు, గోపీవల్లభాపురం, మెళియాపుట్టి మండలం చీపుర్లపాడులో సబ్ కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా చీపుర్లపాడులో నిర్వాసితులతో సబ్ కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమ పిల్లలకు స్కూల్, ఆట స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. రిజర్వాయరు ప్రాంతంలో అనేక మంది ఇళ్లు, ఆస్తులు కోల్పోయారని, వారిని వెంటనే ఆదుకుని ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించిన తరువాతే రిజర్వాయరు పనులు చేపట్టాలని కోరారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని పలాస ఆర్‌డిఒ, తహశీల్దార్‌తో మాట్లాడుతానని అన్నారు. తొలుత మెళియాపుట్టి మండలం గోకర్ణపురంలో వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట మెళియాపుట్టి తహశీల్దార్ పి.సరోజిని, ఆర్ఐలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సతీష్‌కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

'నర్తు' నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి వైసిపి అభ్యర్థి నర్తు రామారావు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు రెండు సెట్ల నామినేషన్‌ను అందించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, రామారావు సతీమని చామంతితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయం నుంచి వాహనాలతో ఊరేగింపుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇప్పటివరకు స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికలకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి బి.నవ్య తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, కంబాల జోగులు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఇచ్ఛాపురం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు పరిపాలనలో పెద్దఎత్తున భాగస్వామ్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నామినేషన్ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. శాసనమండలిలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు కల్పిస్తున్న ప్రాధాన్యత ఆయా తరగతుల అభివృద్ధిపై జగన్‌కు ఉన్న చిత్తశుద్ధి, దూరదృష్టిని తెలియజేస్తుందన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు యాదవ సామాజిక తరగతికి చెందిన నర్తు రామారావుకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించారని చెప్పారు. నర్తు రామారావు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు.



నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న నర్తు రామారావు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఎపి మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి
- ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఎంపిపి పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్న భోజనం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలిపోయి చనిపోయిన మల్లిపెద్ది రమా కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఆ కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రమ 20ఏళ్లుగా వంట కార్మికురాలిగా పని చేస్తోందన్నారు. ఇంటి పెద్ద దిక్కు రమ చనిపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా చాలా ఇబ్బందులు పడుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై, అధికారులపై ఉందని అన్నారు. తక్షణమే ఆమె కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, పని ప్రదేశంలో వేడిని తట్టుకునేలా దుస్తులు ఇవ్వాలని, వంట షెడ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి అల్లు మహాలక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా నాయకులు నాగమణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, మండల నాయకులు శోభారాణి, ఆదిలక్ష్మి, తులసమ్మ, లక్ష్మి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ర్యాలీగా వెళ్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

జిల్లాలో రక్తం కొరత

- రక్తదానానికి ముందుకు రావాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో అవసరాలకు తగ్గట్లు రక్త నిల్వలు లేవని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. రక్తదానం చేసేందుకు ప్రజలు, అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యాన నగరంలోని ఆ శాఖ కార్యాలయంలోని శిక్షణా మందిరంలో రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. సుమారు 86 మంది పశు వైద్యులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలూ రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది మహిళలు రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. జిల్లాలో సుదీర్ఘ జాతీయ రహదారి ఉండడంతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని చెప్పారు. క్షతగాత్రులు, తలసేమియా, ఇతర అవసరాల కోసం రక్తం చాలా అవసరమన్నారు. అందుకు తగిన రక్త నిల్వలు లేవని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, యువత ముందుకు వచ్చి రక్తదానం చేయగలిగితే కొంతమంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఆరోగ్యవంతులు ప్రతి మూడు, ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రక్తదాతలకు కలెక్టర్ ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్‌ను బహుకరించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు ఎం.కిశోర్, ఉప సంచాలకులు ఎం.జగన్నాథరావు, ఐఎస్‌డిపి సహాయ సంచాలకులు పి.సూర్యం, ఆర్.ఆనందరావు, పి.ఎస్.జి బాలకృష్ణ, కె.రాజగోపాలరావు, సిహెచ్.సుబ్రమణ్యం, జి.వి రాజశేఖరం, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు పి.శ్రీకాంత్, పి.చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నూతన పరిశోధనలపై దృష్టి

విద్యార్థులకు కలెక్టర్ పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతన పరిశోధనలపై దృష్టిసారించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగరంలోని ఎవిఎన్ఎంసి హైస్కూల్‌లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి, జిజ్ఞాసను మరింత పెంచుతాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో వస్తువుల ఉత్పత్తి చేసేందుకు పరిశోధనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. తయారీలో ప్రస్తుతం అందుబాటులో ఉండే వస్తువుల కంటే తక్కువ ధరకు అందించినప్పుడే ప్రాజెక్టు విజయవంతమవుతుందన్నారు.

ఇటువంటి ప్రదర్శనల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగ రంగంలో రాణించేందుకు చదువుతో పాటు పలు రంగాల్లో నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి శాస్త్రవేత్తలుగా ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించి విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సర్వీస్ నిబంధనలు రూపొందించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లకు సర్వీస్ నిబంధనలను వెంటనే రూపొందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వాలంటీర్ల చట్టబద్ధత గురించి హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిందని గుర్తుచేశారు. సర్వీస్ నిబంధనలు లేకుండా అధికారాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ నిబంధనలు లేకుండా 50 కుటుంబాలకు ఒక వాలంటీరును నియమించిందని తెలిపారు. ప్రస్తుతం 70 నుంచి 100 కుటుంబాలకు ఒక వాలంటీర్ సేవలందిస్తున్నారని తెలిపారు. వాలంటీర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు సూచనలు అనుసరించి వెంటనే పటిష్టమైన సర్వీస్ నిబంధనలతో ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడేళ్లకు పైగా వాలంటీర్లు పనిచేస్తున్నారని, సర్వీస్ నిబంధనలకు వారంతా పూర్తి అర్హులని తెలిపారు. వాలంటీర్లను నియమించిన వైసిపి ప్రభుత్వం సర్వీస్ నిబంధనలు ఇవ్వకపోతే, వేరే ప్రభుత్వం వారిని తొలగించే ప్రమాదముందన్నారు. ఇప్పటివరకు వారు చేసిన సేవలకు గుర్తింపుగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లతో పని చేయించుకోవడమే కాకుండా వారి పనికి గుర్తింపును ఇవ్వాలని, లేకుంటే వాలంటీర్లు రాష్ట్రవ్యాప్త ఆందోళనబాట పడితే ప్రభుత్వమే స్తంభిస్తుందని హెచ్చరించారు.

కూలీలందరికీ 'ఉపాధి'

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతి గ్రామ పంచాయతీలోనూ పని కోరిన కూలీలందరికీ ఉపాధి చూపించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు ఆదేశించారు. బుధవారం గార మండలం వత్సవలస పంచాయతీ ఆమదాలపాడులో జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలోనూ కనీసం 200 మంది జాబ్ కార్డుదారులకు పనులు కల్పించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్లు అప్‌లోడ్ చేస్తే సకాలంలో కూలి చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కూలీలకు వంద రోజుల పని దినాల కల్పనపైనే ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సగటు కూలి రూ.250 తక్కువ కాకుండా పనులు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పనకు అవసరమైన పనులను గుర్తించి అంచనాలను తక్షణం పంపించాలని, పనుల కొరతను సాకుగా చూపించి ఉపాధిని చూపించకపోతే చర్యలు తప్పవన్నారు. కూలీలు సమయపాలన పాటించి రెండు పూటలా పనులు చేపట్టాలని తెలిపారు. చేసిన ప్రతి పనీ తమ సొంత పనిగా భావించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్ ఎం.రవికుమార్, ఎపిఒ సంధ్యారాణి, జెఇ నారంనాయుడు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల ప్రాజెక్టు ఎంపిక

ప్రజాశక్తి- పొందూరు

శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలకు చెందిన గోల్డెన్ రేషియో మాథ్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైంది. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు వెంకటేష్, పవన్‌కుమార్‌లు తయారు చేసిన ఈ ప్రాజెక్టు ఆకట్టుకుంది. ఈనెల 27, 28వ తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో దీనిని ప్రదర్శించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకరరావు, గణితం ఉపాధ్యాయులు బి.వి.సత్యనారాయణ, డి.భవాని, బి.విశాలాక్షిలు హర్షం వ్యక్తం చేస్తూ.. అభినందనలు తెలిపారు.


నాగవర్ధన్‌తో ఉపాధ్యాయులు

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు

జాతీయస్థాయి వికలాంగుల క్రీడా పోటీల్లో పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎన్.నాగవర్ధన్ షాట్‌పుట్ పోటీలో అద్భుతమైన ప్రతిభను కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఈ నెల 15 నుంచి 19 వరకూ నిర్వహించిన ఈ పోటీల్లో బదిరిల విభాగం నుంచి షాట్ పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకాన్ని సాధించారు. అలాగే వంద మీటర్ల పరుగు పందెంలో కైడా నాలుగో స్థానంలో నిలిచి తన ప్రతిభను చాటాడు. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థికి ప్రధానోపాధ్యాయులు పి.వి.రామరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు డి.ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు పద్మావతి, గణపతి అభినందనలు తెలిపారు.


క్రీడాసనాలు వేస్తున్న విద్యార్థులు

శర్వాణిలో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న శర్వాణి విద్యాలయంలో 'ఏన్యువల్ స్పోర్ట్స్ మీట్'ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో నెహ్రూ యువ కేంద్రం అధికారి కె.వెంకట్ ఉజ్వల్ పాల్గొన్ని పతాకావిష్కరణ చేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శర్వాణి విద్యా సంస్థల చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఎల్లప్పుడు ఆరోగ్యవంతంగా, ఉల్లాసంగా ఉండేందుకు అనేక రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులకు క్రీడాస్ఫూర్తి, మానసిక వికాసం, పోటీతత్వం, శరీర పటుత్వానికి దోహదపడతాయన్నారు. మూడు రోజులుగా విద్యార్థులు పలు క్రీడల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.మనోహర్, కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- సోంపేట

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.చాణుక్య, జిల్లా ఉపాధ్యక్షులు జి.భీమారావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్ల సాధనకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న దశల వారీ పోరాట కార్యక్రమంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు హామీని అమలు చేయాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్ డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని సర్దుబాటు లోపాలను సవరించాలన్నారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు చెల్లించాలన్నారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 11వ వేతన సవరణలోని అసంగతాలను తొలగించాలన్నారు. అనంతరం డిటి గౌరీశంకర్‌కు డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మందస, సోంపేట, కంచిలి మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.ఢిల్లీ, డి.చంద్రశేఖర్, డి.గోవిందరావు, జి.తిరుపతిరావు, ఆర్.కామరాజు, కె.షణ్ముఖరావు, కె.పాపారావు, ఎ.ఢిల్లీరావు, బి.చక్రధర్, ఎన్.కరుణాకర్, గిరిధర్, ముకుందరావు, హరీష్, సంతోష్‌పండా పాల్గొన్నారు.


సోంపేట : మాట్లాడుతున్న చాణుక్య


టెక్కలి : ధర్నా ఉద్దేశించి మాట్లాడుతున్న నేతాజీ

టెక్కలి: సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు బుధవారం టెక్కలి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.నేతాజీరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను తక్షణమే చెల్లించాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలని, ఉద్యోగోన్నతులు, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరావు, యు.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, కుమారస్వామి, శంకరరావు, రామారావు, జయకృష్ణ, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు అంకిత భావంతో పని చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని చీపుర్లపాడు సచివాలయం పరిధిలోని సర్పంచ్, ఎంపిటిసి, వార్డు మెంబర్లు, కన్వీనర్లు, గృహ సారథులతో ఊడికలపాడులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వాడ మాట్లాడుతూ గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో లేడాలను వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారం కోసం టిడిపి ఎన్నో ఎత్తుగడలు వేసి, ప్రజలకు అసత్యాలు చెబుతుందని, దీన్ని తిప్పికొట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించి వృద్ధులు, యువతతో జగన్ పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, సచివాలయ కన్వీనర్లు, ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, మండల అధ్యక్షులు నూక సత్యరాజు, మండల విప్ బి.అప్పన్న, సర్పంచ్ ఎన్.చిన్నమ్ముడు, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

సర్పంచ్‌ను పరామర్శ

మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ సర్పంచ్ గురువెల్లి కేశవరావు తల్లి నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దువ్వాడ శ్రీనివాస్ కేశవరావు ఇంటికి వెళ్లి బుధవారం పరామర్శించారు. నరసమ్మ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు బాడాన మురళి, నూక సత్యరాజ్, డి.శిమ్మన్న, ఎ.కళ్యాణి, పి.సత్యం, తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

లావేరు : లావేరు మండల వ్యాప్తంగా బుడుమూరు, లావేరు, అదపాక, కేశవరాయునిపాలెం విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎఇ వెంకటరమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 132/33 కెవి చిలకపాలెం ఉపకేంద్రం పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.


నేత్ర శస్త్రచికిత్సలు చేయించుకున్న వృద్ధులు

పది మందికి నేత్ర శస్త్రచికిత్సలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని గొల్లవీధిలో హెల్ప్ ఏజ్ ఇండియా సౌజన్యంతో ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి సిబ్బంది పది మందికి నేత్ర శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు కాళ్ల బాబురావు తెలిపారు. బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 60 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. వారిలో పది మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయగా, 15 మందికి కళ్లద్దాలు, 10 మందికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, గొల్ల వీధి పెద్దలు పాల్గొన్నారు.


ట్యాబ్‌లను పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పారావు

బైజూస్ ట్యాబ్‌ల పరిశీలన

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై మండల విద్యాశాఖ అధికారి అప్పారావు బుధవారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థీ ట్యాబ్‌లను సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వై.లత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల పంటలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న సునీత

ప్రజాశక్తి- లావేరు

మన ఇంటి చుట్టూ ఉండే ఖాళీ స్థలాలు, పెరట్లో క్రిమిసంహారక మందుల అవసరం లేకుండా పూర్తి సేంద్రీయ పద్ధతిలో కూరగాయలను సాగు చేసుకోవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత అన్నారు. మండలంలోని కొత్తకుంకాంలో పెరటి తోటల పెంపకం, షెడ్యూల్ కుల ఉప ప్రణాళిక శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రీయ పద్ధతిలో సాగు చేసేటప్పుడు ముందుగా నేలను జీవ శిలీంధ్రాలతో శుద్ధి చేయాలన్నారు. మొక్కల పెరుగుదలకు జీవామృతం, వంట గది వ్యర్థాలతో కంపోస్టు ఎరువులను తయారు చేసుకుని ఉపయోగించాలన్నారు. సాధారణంగా మార్కెట్లో దొరికే కూరగాయలను వీటితో పండించాలన్నారు. వీటి ద్వారా పండించే పంటలను తింటే శరీరానికి అవసరమైన ఖనిజ లవణాలు, విటమిన్లు వంటి పోషక విలువలు సమృద్ధిగా లభిస్తాయని పేర్కొన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త పి.తవిటినాయుడు మాట్లాడుతూ పెరట్లో కూరగాయలు పండించడం వల్ల వాటికి పెట్టే అదనపు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. అనంతరం పాల్గొన్న గృహిణికులకు 11 రకాల విత్తనాలతో ఉన్న కిట్లను ఆమె అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ రావాడ కృష్ణ పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న స్పీకర్ సీతారాం

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ఆమదాలవలస : గ్రామాల్లో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తొగరాంలో స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో పొందూరు మండలం తాడివలస కార్యకర్తలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నియమించిన గృహసారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో ముందడుగు వేయాలని సూచించారు. పొందూరు ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మరమ్మతుల కారణంగా భావనపాడు తీరానికి చేరిన రిగ్

భావనపాడు తీరంలో రిగ్

ప్రజాశక్తి- నౌపడ

భావనపాడు పోర్టు నిర్మాణంలో భాగంగా 20 రోజులుగా మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న యంత్రం(రిగ్) మరమ్మతులకు గురైంది. దీన్ని మరమ్మతులు చేసేందుకు టెక్నికల్ సిబ్బంది మంగళవారం భావనపాడులోని మధ్యపేట తీరానికి చేర్చారు. మూలపేట సముద్ర తీరంలో ఎపి మారిటైమ్ బోర్డు ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా రిగ్ సహాయంతో జియోలాజికల్ సర్వే నిర్వహిస్తున్నారు. అయితే యంత్రంలోని కొన్ని విరిగిన భాగాలకు వెల్డింగ్ చేయాల్సి ఉందని, మరమ్మతులు చేసిన వెంటనే తిరిగి పనులు చేపట్టేందుకు వెళ్తుందని మెరైన్ పోలీసులు చెబుతున్నారు. తీరంలో ఉన్న ఈ రిగ్‌ను చూసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.


కాలిపోయిన కారు ఇంజిన్

కారులో మంటలు

పొందూరు: మండలంలోని తాడివలస వద్ద బుధవారం ఉదయం ప్రయాణిస్తున్న ఓ కారులో మంటలు చెలరేగగా ప్రయాణికులు అప్రమత్తతో త్రుటిలో ప్రమాదం తప్పింది. విశాఖపట్నంలో ఉన్న అంపోలు భాస్కర్ తన భార్యతో కలిసి అత్తవారి గ్రామమైన తాడివలస కారులో వస్తున్నాడు. ఇంతలో రెల్లిగెడ్డ బ్రిడ్జి దాటిన వెంటనే రోడ్డుపై రైతులు ఎండబెట్టిన మినపచేను మీదుకు రాగానే కారు కింది భాగం నుంచి మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమై భార్యతో పాటు కిందకు దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో ఇంజిన్‌లో మంటలు చెలరేగి మొత్తం కాలిపోయింది.


మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

మెళియాపుట్టి: మండలంలోనీ దీనబంధుపురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా హరిపురం సరస్వతి ఇల్లు బుధవారం దగ్ధమైంది. తన కుమార్తె వోణి పంక్షన్ ఆదివారం నిర్వహించనుంది. ఈ సందర్భంగా తెచ్చిన కొత్త బట్టలు, ఇతర సామగ్రి మంటల్లో కాలి బూడిదయ్యాయి. సరస్వతి ఇంటి పక్కన ఉన్న పడాల సోమయ్య, జన్ని సోమేష్, జన్ని కలవయ్య పశువుల శాలలు దగ్ధమయ్యాయి. ఎంపిడిఒ, తహశీల్దార్ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని జనసేన నాయకులు దుక్క బాలరాజు, లక్ష్మీపురం కిరణ్‌కుమార్ కోరారు.


దర్యాప్తు చేస్తున్న డిఎస్‌పి శివరామిరెడ్డి

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

కోటబొమ్మాళి: మండలంలోని దంత గ్రామంలో అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి శివరామిరెడ్డి బుధవారం దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన బొమ్మాళి రవి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూరపు గోవిందరావుపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న డిఎస్‌పి రవి, గోవిందరావుకు మధ్య జరిగిన సంఘటనపై గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రవిపై జరిగిన దాడి స్థలాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ ఎస్‌కె. మహ్మద్ ఆలీ, సిబ్బంది ఉన్నారు.

'కాకినాడ ఆదిత్య' విద్యార్థుల సత్తా

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో 2022-23 బ్యాచ్ విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో సత్తా చాటారు. ఎంఎన్‌సి కంపెనీలో 124 మంది ఉద్యోగాలను సాధించారని కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ బుధవారం తెలిపారు. ప్రాంగణ ఎంపికలో మంచి వార్షిక వేతనంతో ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందివ్వడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. కంప్యూటర్ కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు అభినందించారు.


కవిటి : నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు



సోంపేట : ఫైల్స్‌ను పంపిణీ చేస్తున్న సభ్యులు

హెల్పింగ్ హ్యాండ్స్ దాతృత్వం

ప్రజాశక్తి- కవిటి

అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలిచి మరోసారి తన దాతృత్వం చాటుకుంది హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ. మండలంలోని తొత్తిడిపుట్టుగ గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో ఐదు ఇళ్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఒక్కో బాధిత కుటుంబానికి నెలకు సరిపడే నిత్యావసర సరుకులు, సీతయ్య ఫౌండేషన్ ద్వారా దుస్తులు అందజేశారు. డాక్టర్ పూడి రామారావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నదే తమ సంస్థ ముఖ్యోద్దేశమని అన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, సీతయ్య ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజ్ఞ హెల్పింగ్ హాండ్స్' చేయూత

సోంపేట : మండలంలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నందిగామ మండలం పెంటూరుకు చెందిన ప్రజ్ఞ హెల్పింగ్ హాండ్స్ సంస్థ చేయూత అందించింది. ఈ మేరకు ధ్రువపత్రాలను భద్రపరుచుకునే ఫైల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థ తరపున నిరుపేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అనంతరావు, ఉపాధ్యాయులు, ప్రతినిధులు టి.ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రధాన పంటల్లో అంతర పంటలు సాగుచేయడంతో అదనపు ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో రైతులకు ప్రకృతి సేద్య విధానంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరణ చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని కొంతమంది రైతులతో చెరుకు పంటలో పెసర, మినుము విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి వరుసలుగా వేయించారు. ప్రధాన పంటల్లో అంతర పంటలు వేసుకోవడం వల్ల ముఖ్య పంటకు కావాల్సిన పోషకాలన్నీ లభిస్తాయని పేర్కొన్నారు. రైతులకు అదనపు ఆదాయమూ సమకూరుతుందని పేర్కొన్నారు. ఏకదళ పంటల్లో ద్విదళ జాతికి చెందిన పంటలను అంతర పంటలుగా సాగు చేయడంతో నేల సారవంతంగా మారి భూమి లోపల సహజమైన ఎరువుల ఫ్యాక్టరీ తయారవుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, జానకిరామ్, లక్ష్మి, కృష్ణవేణి, తిరుపతి పాల్గొన్నారు.


చెరుకు పంటలో మినుము విత్తనాలను వేయిస్తున్న చిరంజీవిరావు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరమని ఎస్ఐ రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయి నుంచి సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. దిశ చట్టం, పోక్స్ యాక్టు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తదతర అంశాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులు, బాల్య వివాహాల సమాచారం పోలీసులకు చేరవేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

సార్వత్రిక ఇంటర్‌లో ప్రవేశాలు

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్య మధ్యలో నిలిపివేసిన, పదో తరగతి పాసై, ఇంటర్ చదవని వారికి ఇంటర్ బోర్డు చొరవతో సార్వత్రిక విద్యా పీఠం కేంద్రాలను ప్రతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రజనీకుమారి తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులై ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందని వారు, ఇంటర్ విద్యను మధ్యలో ఆపేసిన వారు ఇంటర్ విద్యను పూర్తి చేసుకునేందుకు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా రాజగోపాల్ వర్ధంతి

పలాస : కాశీబుగ్గలోని ఓ కళ్యాణ మండపంలో బుధవారం పలాస నియోజకవర్గం కళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాల్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కళింగ సామాజిక తరగతికి ఆయన ఎనలేని సేవలు అందించారని, ఆరు సార్లు ఎంపీగా పని చేసి, మంచి సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో దువ్వాడ జివితేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేమబాబు చౌదరి, కోదండ రామయ్య, చాపర వేణుగోపాల్, లభినాన కిషోర్, దామోదర్, ఎండు దోర, దువ్వాడ జయరామ్, సాసుమాను రామారావు, చక్రధర, దువ్వాహర్ష, బడ్డ నాగరాజ్, సంతు, మన్మథరావు, సారథినాయుడు, కునా షన్ముఖరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : అభివృద్ధి ప్రదాత, తాత బొడ్డేపల్లి రాజగోపాలరావు అడుగుజాడల్లో నడుస్తానని మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్ అన్నారు. మాజీ ఎంపీ రాజగోపాలరావు 31వ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఆయన జన్మస్థలం అక్కులపేట కూడలిలో వద్ద ఉన్న విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజగోపాలరావు ఆరు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై జిల్లా ప్రగతికి వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. శ్రీకాకుళానికి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించి కేంద్ర ప్రభుత్వం వద్ద వెనుకబడిన జిల్లాగా గుర్తించి నిధుల మంజూరుకు కృషి చేసిన వ్యక్తి రాజగోపాలరావు అని అన్నారు. ఆమదాలవలసలో సహకార చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం, నైర, రాగోలు, ఆమదాలవలసలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయించడంలోనూ ఆయన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, మాజీ సర్పంచ్ సువ్వారి నేతాజీ, బొడ్డేపల్లి కృష్ణ, వైసిపి నాయకులు చింతాడ రవికుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గాంధీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో తొలి తరం రాజకీయ వేత్త, ఆరు సార్లు ఎంపీగా ఎన్నికైన కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు చిరస్మరణీయులని వైసిపి సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ అన్నారు. వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని కిమ్స్ రోడ్‌లో ఉన్న బిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పైడి విజయ్, రమణారావు, కొంచాడ ఎంపిటిసి ప్రసాద్, పైడి ముకుందరావు, సీపాన దాలి నాయుడు, రాజు, ప్రసాద్, రవీంద్ర పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా మంత్రి సీదిరి జన్మదిన వేడుకలు

పలాస: రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.


అప్పలరాజుకు శుభాకాంక్షలు చెప్తున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం

ఆమదాలవలస : ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో వైసిపి సామాజిక న్యాయం పాటించిందని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని సామాజిక తరగతులకు న్యాయం చేయడంలో సమతూకం పాటించిందన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, టౌన్ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీను, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి రాజు, కూన రామకృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

నేడు ఎపిటిఎఫ్ ధర్నా

కోటబొమ్మాళి: ఉపాధ్యాయ సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన గురువారం ధర్నా నిర్వహిస్తుందని, దీన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.కరుణాకర్, అధ్యక్షులు చల్ల కేశవరావు, హెచ్.శివప్రసాద్ కోరారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం తప్పదని తెలిపారు.